

# 'మళ్ళీ' ఊరు మాటు మణిగింది



ఊరు మాటు మణిగింది. మరీ పొద్దు పోయింది. ద్రాక్షారామంలో నైట్ హాల్ట్ చేసే రాజానగరం బస్సు, కాలవ పక్క గంగరాయి చెట్లకిందాగితే, నీలిమా టీచర్ దిగింది. రోజూ ఆగే నాలుగు రిక్షాలు ఇవాళాగలేదు ఆంజనేయస్వామి గుడిముందు. రామచంద్రాపురం రాజ గోపాల్ టాకీసులోకి 'దక్షయజ్ఞం' వచ్చిందట. అందుకని వూళ్ళో జనాల్ని రెండో ఆట సిన్మాకి మోసుకుపోయాయి రిక్షాలు.

గుళ్ళోదీపం వెల్గుతోంది. దీపం వెలుగులో దేవుడు మెరుస్తున్నాడు. లాకుల దగ్గర వైర్ తాలూకు నిండు కాలువ హోరు. చింతచెట్లకింద పిడబ్ల్యూడి వాళ్ళ




పిమ్మెంటు తోరలమీద, రామచంద్రపురం కాలేజీలో చదివే అమ్మాయి-అబ్బాయిల జంట, వెన్నెల్లో అస్పష్టంగా....

నీలిమా టీచర్ సంచీ కిందపెట్టి జంటనే చూస్తూంది. వాళ్ళిద్దరూ కదుల్తున్నారు, ఏం మాట్లాడు కుంటున్నారో! లాకుల నీళ్ళ హోరులో వినిపించటంలేదు వాళ్ళ మాటలు వినిపించనందుకు తెగబాధ పడి పోయింది.

ఈ ప్రపంచంలో ఎవరిచేతా ప్రేమించ బడని వ్యక్తి మరో ప్రేమించుకునేజంటను చూస్తే ఈర్ష్యపడి తీరడం ఖాయం అని నేనే ఎక్కడో రాశాను కానీ—

నీలిమాటీచర్ కి ఆ రకం నైజంలేదనే సమదర్శిత్వాన్ని అలవాటు చేసుకున్న మనిషి నీలిమ అని ఖండితమైన అభిప్రాయంతో ఇప్పుడు రాయాల్సొస్తోంది. మరి వాళ్ళ సంభాషణలు అస్పష్టంగానైనా వినిపించనందుకు బాధపడి పోవడందేనికి? వాళ్ళయినా ప్రేమించుకో గల్గుతున్నారనే ఆనందం. ఏం మాట్లాడు కుంటారు? అసలు ప్రేమజంటల సంభాషణలెలా వుంటాయి? ఎంతవరకూ సాగుతాయ్? ఎంతటితో తెగుతాయ్? అవి వినాలనే వుత్కంఠ. అయ్యో నేను ఎవరిచేతా ప్రేమించ బడటం లేదనే బాధ, చింత తప్ప—

జెలసీ పాలేమాత్రం లేదిందులో.

నందివర్ధనం పువ్వురంగు తెల్లటి చీరలుకట్టే నీలిమ నల్లగావుంటుంది. కేదారేశ్వరుడి ఆలయంముందు ఆకాశదీపంలా అందంగా వుంటుంది. పర్జన్యాల్ని పెళ్ళగించి ఉదయించే చంద్ర దీపికలా నవ్వుతుంది. శివరామశాస్త్రిగారి దృష్టిలో

సీలిమ___

"అది మాలదోయ్. అందులోకీ వయసులోవున్న ఆడది కూడాను. అది పాఠాలుచెప్పే క్లాసులకి పంపించకండి మన పిల్లల్ని." ఎవరో కాలువ వేపొస్తున్నారని జ్ఞాపకాలకి జారుముళ్ళువేసి, శరీరాన్ని స్వాధీనంలోనికి తెచ్చుకుని, బరువైన సంచీతో వూళ్ళోకి నడిచింది సీలిమ.

శివరామశాస్త్రిగారెదురయ్యారుదగ్గుతూ. ఆ సమయం ఆయన చింతలగట్టుకెళ్ళే సమయం. సీలిమ ఎదురయిందని ఐదు అడుగులు దూరానికి తప్పుకుని మరీ వెళ్ళిపోయారు.

సీలిమా టీచర్ ముందుకి నడచింది మరి___

## 2

ఏ వూరునుంచీ వలసరాలేదు శివరామశాస్త్రిగారు. ఆయన్దావూరే. అనాదిగా ఏభై ఎకరాల పల్లపుమాగాణితో సుఖసంపన్నంగా వర్ధిల్లుతున్న వంశం ఆయనది. వాళ్ళ వంశానికిగానీ___ఆయనగ్గానీ విశేషించి చెప్పుకునే చరిత్రలేవీ లేవు. వుంటే నత్తగుల్ల కథలుండొచ్చు.

ఐనా___

శాస్త్రిగారి గురించి.. ....

వుదయం గాయత్రీ మంత్రం చదివి జపంగానిచ్చేప్పుడు ఇంట్లో, రాగిచెంబుతోమే శబ్దం విన్పిస్తేచాలు, తప్పు ఎవరిదయినా ముందు ఆడాళ్ళని తిడ్తాడు. ఇలాంటి సమస్యేదోవచ్చి రెండేళ్ళక్రితం ఇంటి పెద్దకోడల్ని గుండెలమీద గుద్దాడట.

ఆయన దృష్టిలో___

ఈ ప్రపంచంలో ఆడది ఒక సమస్యట. అందుకే తెల్లవారిలేచి, ఆడజాతిని అన్యకులస్థుల్ని అపనిందపాలు జేస్తేగాని మనసుకి తృప్తిగా వుండదాయనకి

సాయంత్రం___

రాములవారిగుడి అరుగుమీద కూర్చుంటాడు. నల్గురు పోగుపడేసరికి వుపన్యాసం.

" అసలీప్రపంచానికిఆడదోసమస్య. ఈ ఆడాళ్ళు వుద్యోగం చేసే కారణంగానే మా ఆఖరివాడు వుద్యోగం దొరక్క రామచంద్రాపురాన్ని గేస్ ఏజన్సీ తీసుకొని ఏడ్వవాల్సొచ్చింది, మగాణ్ని ఆడది ఉద్రేక పరుస్తున్నందుకే యీ జనాభా. బర్త్ కంట్రోలంటే మాత్రం "

ఇలా సాగదీస్తారాయన.

మరీ పొద్దుపోయాక సంతపేటలోంచి అలా కాల్వగట్టుకొచ్చి గోపాలరావు కాఫీ హోటల్లో నీళ్ళుతీస్కుని బయల్దేరతాడు చింతలగట్టుకి

ఆయన వూళ్ళోంచొస్తుంటే కోమటి సత్యం వీధిలో ఆడాళ్ళు చల్లగాలికి అరుగులమీద కూర్చుని ఏ సన్యాసమ్మ కథో లక్షమ్మకథో చెప్పుకుంటుంటే, శాస్త్రిగాడు వీధిమొగలో కన్పిస్తేచాలు లోనికిపోతారు.

వాళ్ళనిచూసి నవ్వుకుంటాడు శాస్త్రిగారు.


"మరీ లజ్జ మర్చిపోతున్నారు."

ఇలాంటి మనుషులున్న ఆ వూళ్ళో సీలిమ వుద్యోగం చేస్తోంది!!!

## 3

"మూన్‌లైట్ మీకళ్ళల్లో సెమిలర్లీగా కన్పిస్తున్నది మేడమ్ యీసాధృశ్యంతో నన్ను ఇముడ్చుకోండి" అన్నాడతను

"మీ ఫాదర్‌కి లేడీస్‌ని సెడ్యూస్ చేసే గుణం అధికంగావుంది. అందుకే




నాకు భయంగా వుంది."

"రీవిట్ మేడమ్ అలాంటి విషయాలు మనం పట్టించుకోగూడదు."

"సరే....నన్ను నిజంగా పెళ్ళి చేసుకుంటావు కదూ! ప్రేమించే మనిషి కోసమె నా హృదయం పడే సంక్షోభం."

"నిన్ను పెళ్ళి చేసుకుని, ప్రేమలో విలువనా ముంచి నీ మనసుని నిశాకృతం చేస్తాను సరా?"

"థాంక్యూ....థాంక్యూ"

"ఈ గట్టు నెందుకూ కాలువలో తెక్కువ రా అలా తూరల వేపెళ్దాం."

అలా పోయారు ఆమె-అతను.

ఆమె నీలిమా టీచర్. అతను శివమోహన్. శివరామశాస్త్రిగారబ్బాయి. రామచంద్రపురాన్ని రాజగోపాల్ పిక్చర్ పేలెస్ కెళ్ళే దార్లో ఇండేన్‌గ్యాస్ ఏజన్సీ రన్ చేస్తున్నాడు.

ప్రే.... మి ....ం... చు .... కుంటున్నారు వాళ్ళిద్దరూ. నెల రోజుల్నించి.

4

9 గంటల రాత్రి—

ఆ రోజు వుదయంనుంచీ వర్షం కురిసింది. చింతలగట్టంతా బంద బందగా చిత....చిత లాడ్తోంది.

దేహాశంక పూర్తిగానిచ్చి కాళ్ళు కడుక్కునేందుకు కాలువలోకి దిగి బురదవల్ల జారి, వూబిలోనికి కూరుకు పోయారు శాస్త్రిగారు.

ఆ కాలవ ఎప్పుడూ నిండుగా ప్రవహిస్తుంది. ఆ కాలువలోనే ఎంతోమంది పిల్లలు స్నానాలకొచ్చి మునిగి చనిపోయారు. అదే కాలువలో అత్తమామల పోరు భరించలేక రిక్షతొక్కే 'యాకోబు'

చెల్లెలు మునిగి ఆత్మహత్య చేసుకుంది.

అలాంటి లోతైన కాలువలో ఇవాళ శాస్త్రిగారు దిగబడి మునిగిపోతున్నాడు. నీళ్ళు తాగేస్తున్నాడు. కాస్సేపట్లో ప్రాణాలు పోగొట్టుకుంటాడు.

ఆ సమయంలో కాలువ గట్టుమీదుగా-

ఓ మనిషి చేతి సంచీతో వస్తూ ఎవరో మనిషి మునిగిపోతున్నాడని చూసి, సంచీ బురదలో వదలి నీట్లోకి దిగి శాస్త్రిగార్ని పైకి తీసుకొచ్చాడు. తన భుజంమీద తుండుగుడ్డతో ఆయన తలా, వళ్ళూ తుడిచాడు.

"సమయానికొచ్చావు బాబూ. నాకింకా భూమ్మీద నూకలున్నాయనే పంపాడా దేవుడు నిన్ను."

"మరీ మధ్యకెళ్ళలేదు గాబట్టి సరిపోయింది. లేకపోతే నేనూ ఏమీ చేయలేక పోయేవాడ్ని బాబా."

"ఏ వూర్నుంచొస్తున్నట్టున్నావ్ బాబూ!"

"శిచ్చవరండి. కోటిపల్లి దగ్గర గంగవారంవండి మాది. దెయ్యాల బండ్లో వచ్చానండి."

"ఎవరింటికి?"

"దూరపు బంధువుల పిల్ల వుద్యోగం సేస్తందండీ."

"ఏ వుద్యోగమబ్బా?"

"పంతులమ్మద్యోగమండీ ... నీలమ్మ ఆ పిల్ల పేరు."

"ఏవిటీ?" శాస్త్రిగారి వళ్ళంతా కంపరం పుట్టింది. వాడి వాసన తుండుతో తన తల తుడిచాడు. తన్ని నీట్లోంచి మోసుకొచ్చాడు వెధవ.

బాబూ తవరు నడ్లేరు నా భుజం మీద సెయ్యేయ్యండి."

"అక్కర్లేదు. వెళ్ళు నీదార్ని." అని కసురుకున్న శాస్త్రిగార్ని ఆ మనిషి వింతగ చూస్తూ పోయాడు ముందుకి ...వూళ్ళోకి

## 5

"ఫారిన్‌లో అనుకున్నది సక్సస్ కాకపోతే ఆత్మహత్యలు చేసుకుంటార్ట. మన దేశం వాళ్ళకాధైర్యం లేక సన్యాసం పుచ్చుకుంటారు. ఫన్నీ."

"నాకా ధైర్యం వుంది. మీరు నన్ను పెళ్ళి చేసుకోకపోతే నేనీ కాలువలో పడే చావాలి."

"వా .. ట్?? నో...నో మేడమ్ అంత వెర్రిసాహసం పనికిరాదు. రీసెంట్ రామచంద్రపురంలో వో టైప్ ఇన్‌స్టిట్యూట్ అతను మా ఫ్రెండే, అతని సిస్టరూ—మరో అబ్బాయీ అదే పని చేశారు. ఎందుకో ఆ సెమిరిటీ? నువ్వూ అదే చేస్తానంటే నా మనసేంగానూ?"

"నాకు మూడోమాసం."

"నాకు నవ్వొచ్చేస్తుంది మేడమ్. పాతికేళ్ళు వయసు పెట్టుకుని మూడోమాసం అంటావేం?"

"నాగర్భానికి"

"నిజవా?"

"నిజం"


"లీవిట్ మేడమ్ అవి మనప్రేమకి అడ్డురాదుగా."

"కడుపులో బిడ్డ రాజుకున్న నిప్పులా పెరగుతుంది క్షణ క్షణానికి."

"పెరగనీ మేడమ్! పెరిగేదాన్ని తరిగేదాన్ని నిలుపకూడదు. పాపం.... పెరగనీ",

## 6

అన్య కులస్థుల్ని ఆడజాతినీ తిట్టి




తిట్టి అలిసి పోయేసరికి 10 గంటల రాత్రయింది. టైమయిందని చింతల గట్టుకి బయల్దేరారు శాస్త్రిగారు.

గట్టున నత్తగుల్లలా నడుస్తుంటే పెద్దగా పొలికేక విన్పించింది శాస్త్రిగారికి. అదీ నీళ్ళలో ....ఆడకేక.

గబగబా వొడ్డుకెళ్ళారు.

"బాబూ వడ్డుకి తియ్యండి నన్ను... పుణ్యం గట్టుకోండి బాబూ!"

"ఎవరూ?" పరిశీలనగాచూస్తేతెల్సింది. ఆమె నీలిమ. అరె.. కాళ్ళు నీళ్ళల్లోకి కూరుకుపోతున్నాయే. అమ్మయ్యో నీళ్ళల్లోకి పూర్తిగా మునిగిపోతుందే. దీన్ని రక్షిస్తే రెండుచేతులూ నరుక్కోవాలి.

"బా ...బు... గారూ రక్షిం ...."

క్రమక్రమంగా నీలిమా టీచర్ నీళ్ళల్లోకి మునిగిపోయింది పూర్తిగా.. కాస్సేపటికి ఆమె తెల్లచీర నీటిపైన పరుచుకుపోయింది.

గుట్టుచప్పుడు గాకుండా యింటికెళ్ళిపోయారు శాస్త్రిగారు.

## 7

మరునటిరోజు 'వెల్ల'లాకుల దగ్గర నీలిమ శవం తీసిన పోలీసులు, పోస్ట్ మార్టమ్ షెడ్ కి తీస్కెళ్ళి, ఆత్మహత్యగా నిర్ణయించారు.

ఆరాత్రి శివమోహన్ త్వరగా ఇంటికొచ్చి, భోంచేసి, వాకిట్లో మంచంవేసుకు పడుకున్నాడు.

నిన్నరాత్రి. 'నీలిమ' "నన్ను పెళ్ళాడకపోతే పోలీస్ రిపోర్టు యిస్తాను. వూళ్ళో మాదిగాడిచేత టముకు వేయిస్తా"నంటే భయపడి లాక్ వైర్ లోకి తోశాడు.

తను నీలిమా టీచర్ని నీటిలోకి తోసినట్టు ఎవరికీ తెలీదు. తెల్సినా శివరామశాస్త్రిగారబ్బాయి యీపని చేశాడంటే ఎవరూ నమ్మరు. ఈ కేస్ సుప్రీమ్ కోర్టుకెళ్ళినా నెగ్గదు. ఇది పచ్చినిజం. □